
అరణ్య ఘోష
మైథిలీ వెంకటేశ్వరరావు

కోటానుకోట్ల నిధి....

వజ్రవైఢూర్య మణి మకుట గోమేధిక పుష్యరాగాలు గల బంగారు పేటిక..... దాని కోసం ... ముగ్గురు ఇంటర్నేషనల్ క్రిమినల్స్....

వారికా నిధి అందకూడదని అనుక్షణం వారితో పోరాడే ఓ నవయువ సాహస జంట.

వారందరికీ తెలియకుండా వెంటాడే ఓ బడా పెద్ద మనిషి... అతనికి తోడు ఓ చోటా గూండా.

అంతా ఒకే చోటికి చేరుకున్నారు. అదీ కీకారణ్యంలో.... సరిగ్గా అప్పుడు మొదలైంది......

అరణ్య ఘోష

ఇది మైథిలీ వెంకటేశ్వరరావు రచన

అరణ్య ఘోష
By
మైథిలీ వెంకటేశ్వరరావు
ధర: రూ. 90/-

ముద్రణ :
మే 2008

**G. VENKATESWARA RAO**
**D.No : 28-23-21, Arundelpet,**
**Kaza Venkateswara Rao St,**
**VIJAYAWADA - 520 002.**

# అరణ్య ఘోష

మైథిలీ వెంకటేశ్వరరావు

# మైథిలీ వెంకటేశ్వరరావు రచనలు

చిత్రాంగి

స్... స్... స్నేక్

వయ్‌లెన్స్

రాజధాని ఎక్స్‌ప్రెస్

ఇంద్రజ

డ్రాక్యుల

బీస్ 2008

మధు విలాస్

అరణ్య ఘోష

అనూ! నను ప్రేమించానను

సైంటిస్ట్ సావిత్రి

బిగ్ బాస్

భార్య–ప్రియుడు

బలి

అంతఃపుర కన్య

★ ★ ★

# అరణ్య ఘోష

**కొన్ని వందల సంవత్సరాల క్రితం -**
**రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యంలో ఓ చిన్న రాజ్యం....**

ప్రస్తుతం ఆ రాజు ముందు అయిదుగురు వ్యక్తులున్నారు. అందరూ ఆతృతగా ఠీవిగా ఆసీనులయిన రాజునే చూస్తున్నారు. ఆ రాజు పేరు వారన్.

"ఇప్పటికే చాలామందికి ఇచ్చాం... ఏమీ ప్రయోజనం కనపడటం లేదు."

అందరి ముఖాల్లోనూ నిరుత్సాహం....

"ప్రభువులు అవకాశం ఇవ్వాలి. రసవాదంలో మమ్మల్ని మించిన వారు ఈ పరగణలోనే లేరు. అవకాశం ఇస్తే అదృష్టవంతులమని కూడా నిరూపిస్తాం. పైగా మా తండ్రుల, తాతల నుంచి ఎన్నో మెళుకువలు నేర్చుకునిగాని మీ ముందుకొచ్చే సాహసం చెయ్యడం లేదు."

ఆయన మందహాసం చేశారు. వినయంగా అడిగిన అతని వంక ఎగతాళిగా చూసి అన్నారు.

"ఎన్నో విన్నాం, ఎందరినో చూశాం.. బ్రిటీష్ సామ్రాజ్యం నిండా మీలాంటి రసవాదులే కాని ఫలితం.....శూన్యం."

"ఎందరో ఆల్కెమిస్టులకు లైసెన్సులు మంజూరు చేశారు. వారందరిలా ప్రభుత్వ ఖజానాని ఖాళీ చేయం. కొద్దిపాటి లోహాలు ఇప్పిస్తే చాలు, మా ప్రతిభని ఏలినవారి ముందు నిరూపిస్తాం."

"చాలా మంది చాలా చెప్పారు. మాటలు కోటలు దాటడమేగాని, బంగారం తయారవ్వలేదు."

"ఇప్పుడవుతుంది. మధ్యయుగం నుంచి యూరప్ ఖండమంతా జోరుగా సాగించిన పరిశోధనల తెర కేవలం కొద్దిరోజులలో మాచే మూయ బడుతూంది."

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావ్?" ఆయన ఆసనం మీంచి లేచి అన్నారు.

"నమ్మకం. మా అయిదుగురి మేథస్సును రంగరించి తయారు చేస్తాం. బంగారం కోసం భూమి పొరలని చీల్చే అవసరం భావితరాల వారికి ఇకపై వుండదు."

"కానీ బంగారం మీ మేథస్సుతో మాత్రమే తయారవ్వదు."

"అందుకే కొన్ని లోహాలని, అనుమతిని అడుగుతున్నాం. ఇనుము, సీసము, రాగి వంటి వాటిని బంగారంగా మార్చేయవచ్చు... ఆ లోహాల్లో పాదరసం, గంధకం, లవణం ఉంటాయి. వాటిల్లో కొద్దిపాటి మార్పు ద్వారా ఖచ్చితంగా బంగారం తయారవుతుంది."

"అయితే అందరితోపాటు మీకూ అనుమతిని, కావలసిన లోహాలని ఇస్తాను..... కేవలం నెలరోజులు. ఈలోగా మీరు మాటల్లో చెప్పుకున్న గొప్పతనాన్ని చేతల్లో చూపించాలి. లేదా మీ అనుమతి రద్దు అవుతుంది. బంగారం తయారుచేసే వంకతో ప్రభుత్వ ఖజానాకి గండికొడుతూ, పిచ్చి పరిశోధనలు చేస్తూ కాలం వెళ్ళదీయాలన్న ఆలోచన ఈ మధ్య చాలా

మందికి కలుగుతోంది. అలాంటివారు మీరూ ఆయితే శిక్షించటానికి వెనుకాడను. వెళ్ళండి.”

ఆ అయిదుగురు మరింత వినయంగా వంగి నమస్కారం చేసి శెలవు తీసుకున్నారు.

కేవలం గంటల్లోనే వారికి కావలసినవన్నీ వారిముందు ఉంచబడ్డాయి. అయిదుగురూ వాటి వంక విప్పారిన నేత్రాలతో చూశారు.

తమ తండ్రులూ, తాతలూ ఈ గూఢ విద్యలో ఓటమిని చవిచూసి బ్రతికినంత కాలమూ శోధిస్తూనే కళ్ళు మూశారు.

కొద్దిపాటి ఆస్థులతో పాటు తాత, తండ్రుల వృత్తిని స్వీకరించిన ఆ అయిదుగురు యువకులు ఆ లోహాలవంక గర్వంగా చూశారు.

ఆ అయిదుగురు వాటిని చకచకా అందుకున్నారు. లోహాలని కరగదీశారు. వాటిని గాజు బీకర్లలో వుంచారు. మొదట ఇనుముని ఆధారంగా తీసుకొని, మరో రెండు ఇతర లోహాలతో కలిపారు.

అందరి చేతుల్లోనూ చిన్న గాజు బుడ్డీలు. వాటి నుంచి పొగలు... కళ్ళు మండుతున్నాయి... గది మొత్తం పొగతో నిండిపోయింది. అందరి కళ్ళల్లో నీళ్ళు ... కళ్ళల్లో కమ్మీలు గుచ్చినట్టు బాధ కలుగుతోంది.

అయినా వారు ఆపటంలేదు. ఏకాగ్రతగా కరిగించిన లోహాలని మిశ్రమం చేస్తూనే వున్నారు. ఇరవైనాలుగు గంటలు గడిచాయి.

ఆకలి దప్పులు మరిచారు. కేవలం ఆ సమయంలోనే రెండు వందల మిశ్రమ లోహాలని తయారు చేశారు. ఆపై వాటిని మళ్ళీ మరొక దానిలో మరొకటి కలపటం ప్రారంభించారు. రోజులు గడుస్తున్నాయి. వారు రెట్టించిన ఉత్సాహంతో కష్టపడుతున్నారు.

ఇలా ఇరవైతొమ్మిది రోజులు గడిచాయి. వారన్ ఇచ్చిన గడువు ఇక ఒక్కరోజే మిగిలింది. వారన్ ఇచ్చిన లోహాలూ, వారి శరీరపు శక్తి పూర్తిగా కరిగిపొయ్యాయి.

అందరిలోనూ నిరాశావాదం... నిస్పృహ...

వారి కళ్ళల్లో నీళ్ళు లేవ్... అయినా అందరికి తెలుస్తోంది. వారి హృదయం రోదిస్తుందని...

**ఓటమి తప్పనిసరయినప్పుడు వచ్చేది బాధేగా...**

ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూసిన అవకాశం.. ఎదురుగా బూడిదగా–

అందరూ నుదుళ్ళు రుద్దుకున్నారు... అందరూ నిశ్శబ్దంగా ఒకరినొకరు చూసుకున్నారు.

అప్పుడెలిగింది వెలుగులా– ఒకే ఒక వ్యక్తి మదిలో....

అయిదుగురిలోని ఒక వ్యక్తి చురుగ్గా తిరిగాడు. యంత్రంలా కదిలాడు. మొదట్నించి రాసిపెట్టుకున్న నోట్సుని అందుకున్నాడు. ఆలోచనకనుగుణంగా లోహాలని కలపటం ప్రారంభించాడు.

అందరి కళ్ళు అతని వైపే... వారి చూపులు ఎగతాళిగా ఉన్నాయి. ఇత్తడి 70 శాతం, రాగి 30 శాతం కలుపుతున్నాడు. ఏమౌతుంది జింక్ తయారవుతుంది.

అంతేగా, కేవలం అందుకా అంత హడావుడిగా లేచింది. మిగతా నలుగురూ అలాంటి ఆలోచనల్లో ఉండగానే అతను ఈసారి అల్యూమినియం, మెగ్నీషియం కలిపిన మిశ్రమ లోహాన్ని కలిపాడు.

అద్భుతం...

నల్లగా వున్న ఆ లోహం పచ్చగా మారింది.

మొత్తం అందరి శరీరాలు తడబాటుతో వణికాయి. ఉద్వేగంతో కదిలిపొయ్యారు.

విభ్రాంతిగా అతని వంక చూశారు.

అతను విజయగర్వంగా తాను కలిపిన మిశ్రమాన్ని చేత్తో తాకాడు. ఆప్యాయంగా నిమిరాడు. ఎత్తి గుండెలకి హత్తుకోబొయ్యాడు. ఆ కొద్ది

పదార్థాన్ని ...గుండెల దాకా చేరకుండానే అతని చేయి ఆగింది. మిగతా వారు ప్రశ్నార్ధకంగా చూశారు.

బాధగా పళ్ళు బిగపెట్టి పక్కనున్న సహచరుడికిచ్చాడు.

అతనికి అందుకోగానే అర్థమైంది...

బాగా బరువుగా వుందని... బంగారం బరువుండకూడదు.

మిగతా అందరికి దాన్ని అందుకోగానే అర్థమైంది. బంగారానికి వుండే ఏకైక అర్హత బరువుండకూడదు. తేలికగా వుండాలి...

అదే లేదు... బరువుగా ఊపిరి పీల్చారు...

“నిరుత్సాహ పడద్దు... విజయం ఎంతో దూరంలో లేదు. బరువు తగ్గాలి. అంటే.. అంటే...!?” సాలోచనగా తల పంకించాడు.

ఈలోగా మరొకతను అందుకున్నాడు.

“నేను తగ్గిస్తాను బరువుని...” అంటూ పచ్చగా మారిన ఆ పదార్థాన్ని మరో ద్రవంలో వేశాడు.

మరుక్షణం నల్లగా మారిపోయిందా ద్రవం...

పదినిమిషాలు అందులో వుంచి పట్కార్‌తో పైకి తీసాడు. చల్లటి నీటిలో వుంచి రెండు చేతులతో తీసుకొని అరచేతిలో పెట్టుకొని రుద్దుకున్నాడు.

భూభ్రమణాన్ని కనుగొన్న గెలీలియో కాని, విద్యుత్‌ని కనుగొన్న ఓల్టా కూడా తొలిసారి తాము విజయం సాధించినప్పుడు అంతగా ఆనందపడి వుండరేమో.... పైకప్పు తాకేలా ఎగిరారు.

మొత్తం గదే ఆనందంతో అదిరిపోయింది. కొన్ని వేల సంవత్సరాలుగా నిరంతరం తపిస్తున్న ఆల్కెమిస్టుల ఆశ నెరవేరింది. తపన తీరింది.

ఇక ప్రపంచంలో ఇళ్ళని ఇటుకలతోకాదు.. బంగారంతో... పసిమితో కట్టుకోవచ్చు.

అలాంటి ఆ సమయంలోనూ వారు ఏ ఏ మిశ్రమాల ద్వారా బంగారం తయారవుతుందో క్లియర్‌గా నోట్ చేసుకున్నారు.

"పదండి వారన్‌కి చెబుదాం... మన ఆనందాన్ని ప్రపంచానికి పంచుదాం."

"అది బంగారం కాదు..." కంచులా వినపడింది ఓ కంఠం.

అయిదుగురూ ఉలిక్కిపడి వెనుతిరిగారు.

వారన్– గంభీరంగా సాయుధులైన సైనికుల మధ్య హుందాగా నడుస్తూ వచ్చారు.

"మీరు పొరబడుతున్నారు... బంగారానికి కావలసిన రంగు, బరువు, నాణ్యం అన్నీ వచ్చేశాయి. ఈ మిశ్రమాల ద్వారా కొద్దిపాటి ప్లాటినం ద్వారా ఏ ఇనుప వస్తువునయినా బంగారంగా మార్చొచ్చు."

వారన్ మందహాసం చేసాడు.

"నిజమే మిత్రులారా, అయితే ఈ ఆనందంలో మీరొకటి మర్చిపోయారు. బంగారానికి కావలసిన ప్రాథమిక గుణాలు బరువు, నాణ్యం, రంగే కాదు మరొక గుణం కూడా వుంది. అది సాగే గుణం.. అదే ఇందులో లేదు... కావాలంటే పరీక్షించి చూడండి."

వారన్ చెప్పటంతోనే అందరూ నాలుకర్చుకుని అందులోంచి ఓ ఔన్స్ బంగారాన్ని తీశారు. విడిగా స్వర్ణకారులు ఉపయోగించే ఇనుప సుత్తులతో నెమ్మదిగా కొట్టసాగారు.

వారన్ దీక్షగా చూస్తున్నాడు.

కేవలం ఆ కొద్దిపాటి బంగారంతో యాభై ఒక్క మైళ్ళ పొడవుగల సన్నని తీగ తియ్యవచ్చు.

అలాంటిది అన్ని మైళ్ళు అటుంచి అర సెం.మీ. కూడా సాగటం లేదు. నేలమీద పడ్డ పాదరసంలా సాగదీస్తుంటే చిన్న చిన్న ముక్కలవుతోంది.

అందరూ అసహనంగా తల విదిలించారు.

ముడి ఖనిజాలని కరగించే కొలిమిలా ఉడికిపొయ్యారు.

వారన్ అందరికి ధైర్యం చెబుతున్నట్టుగా ఒకతని భుజంతట్టి చెప్పాడు.

"విజయం కేవలం గడ్డిపోచ దూరంలో వుంది. మీ పరిశోధన గురించి విశ్వమంతా ఎదురు చూస్తోంది. మీ బుర్రలు పగిలేలా, నరాలు చిట్లేలా ఆలోచించండి. కొన్నివేల సంవత్సరాలుగా బంగారం తయారు చేయాలన్న మానవుడి ఆశ, ఆరాటం, పోరాటం ఆ రోజుతో తీరిపోవాలి. మనమంతా ప్రపంచాన్ని ఏలాలి."

అందరూ ఓ నిర్ణయానికి వచ్చినట్టు కూడబలుక్కున్నారు. తమలో తాము గొణుక్కున్నారు. నోట్ చేసుకున్న పత్రాన్ని పరిశీలనగా చూశారు. అందులో ఏ లోపమూ కనిపించలేదు.

వారన్ ఊపిరి బిగపట్టి చూస్తున్నాడు.

అయిదుగురూ వారన్ దగ్గరికొచ్చారు.

"మా పరిశోధనల్లో ఎలాంటి సందేహం లేదు. కొన్ని వేల మిశ్రమాలని రకరకాలుగా కలపగా తయారయిన ఈ బంగారంలో సాగే గుణం తేవటానికి ఒకే ఒక మార్గం వుంది. అయితే 'ఇది' అని చెప్పలేక పోతున్నాం. ఆపై పరమాత్ముడి దయ."

"ఏమిటది?"

"సాగే గుణంలేని ఈ బంగారాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి కొన్ని మిశ్రమ రసాయనాల్లో కలపాలి. అలా కలిపిన కొద్దిపాటి బంగారాన్ని ఆపై పరీక్షించాలి. ఇలా సాగే గుణం వచ్చేదాకా చేస్తూనే వుండాలి."

"చెయ్యండి" చెప్పాడు తేలికగా వారన్.

"అందులో ఓ చిక్కు వుంది. కొన్ని వేల మిశ్రమాలు."

"ఓగాడ్. కొన్ని వేల మిశ్రమాలున్నాయి. పైగా వీటిని ఒకదానిలో ఒకటి కలిపితే కొన్ని లక్షల మిశ్రమాలవుతాయి. ఎన్నింటిలోనని కలిపి చూస్తారు!?"

"అంతకుమించి వేరే దారిలేదు... ఆపై అదృష్టం."

"వేరే దారే లేదా?"

ఆ ప్రశ్నకి సమాధానంగా వారు ఆ బంగారాన్ని చిన్న చిన్న గుండ్రని ముక్కలుగా విడగొట్టారు. పట్‌కార్‌లతో ఆ ముక్కలని ద్రవాల్లో ముంచారు.

కొద్దిసేపు తర్వాత బయటికి తీసారు. ఒడలిపోయి, కమిలిపోయిన వారి మొహాల్లా నల్లగా వున్నాయి వారి చేతుల్లోని ఆవగింజంత బంగారపు ముక్కలు. వారన్ కళ్ళు చిట్లించాడు.

మళ్ళీ అయిదుగురూ మరో అయిదు మిశ్రమాల్లో ముంచారు.

ఒకటి, రెండు

మూడు.. నాలుగు... అలా అలా చేస్తూనే వున్నారు.

అయిదు చేతులు పైకి లేచాయి.

వారన్ కూడా ఉద్వేగంగా చూస్తున్నాడు.

ఆ అయిదుగురి చేతుల్లో చిన్న పట్‌కార్‌లు వాటి పళ్ళ మధ్య బంగారం ముక్కలు అంతకు ముందులా నల్లగా మారిపోయివున్నాయి. అందరి దగ్గరాకాదు కేవలం నలుగురి దగ్గరే... మిగతా ఒక్కరి దగ్గర పట్‌కార్ పళ్ళమధ్య మెరుస్తోంది. బంగారమే... ఇరవైనాలుగు కేరట్ల అసలు సిసలు బంగారం.

పచ్చగా... పసిమి.

వారన్ రెండు చేతులు పైకెత్తి విజయసంకేతం చేశాడు. నలుగురి చేతుల్లోని పట్‌కార్‌లు జారిపొయ్యాయి. మిత్రుడిని ఒక్కసారిగా గాలిలోకి లేపారు.

"గెలిచాం.... సాధించాం..."

వారన్ తల ఎగరేశాడు. సైనికులు కూడా ఆనందంతో గెంతులు వేసారు. ప్రపంచానికిది సుదినం. ఇక నుంచి అంతా స్వర్ణయుగమే...

వారన్ వారి చేతులకి తన చేతులతో 'ఢీ' ఇస్తూ ఐదుగురి మీద చేతులేసి ఆనందంగా కౌగిలించుకున్నాడు. సాగే గుణం రావటానికి ఏ మిశ్రమాల్లో కలపాలో అడిగాడు దానికి సమాధానంగా–

మిగిలిన సాగే గుణం లేని బంగారాన్ని కూడా ఆ మిశ్రమంలో ముంచి పూర్తి బంగారంగా మార్చి వారన్ కాళ్ళముందు పెట్టారు. భక్తిగా మోకరిల్లారు.

"తొలి బంగారాన్ని అందుకునే అర్హత మీకు మాత్రమే వుంది" చెప్పారు ఏకకంఠంతో–

"బంగారాన్ని ఏఏ పాళ్ళలో ఏ మిశ్రమంలో కలపాలో తెలియచేసే ఫార్ములా... ఇది వుంటే చిన్నపిల్లాడు కూడా బంగారం చెయ్యగలడు."

వారన్ గర్వంగా సైనికుల వంక చూసి తల వూపాడు.

అంతే...

ఎక్కడ్నించి వచ్చాయో, ఎటునుంచి వచ్చాయో, అస్సలేమి జరిగిందో అర్థం కాకుండానే వీపులో ఏవో దిగాయి. అవి విషపు బాణాలు.

"ఆం" అని మాత్రమే అన్నారు. తెరిచిన నోళ్ళు అలానే వుండి పొయ్యాయి. నలుగురు అలాగే ముందుకు వాలిపోయారు. కేవలం సెకన్స్‌లోనే వారి ప్రాణం పోయింది.

మిగతా ఒకరు... అతనికీ అందరిలా వీపులో విషబాణం కస్సున దిగింది. అయితే సరిగా వెన్ను పూసని గుచ్చింది. బాణం అక్కడి ఎముకకి తగలటంతో కలుక్కుమంది. బాణానికి అంటిన విషం రక్తనాళాలకి తగలటం కనుమూసి తెరిచేంత ఆలస్యం అయింది. అందుకే అతని ఆయుష్షు ఓ నిమిషం పెరిగింది.

వారన్ వికటంగా నవ్వాడు... గది గోడలు పగిలిపోయేలా.

"రాస్కెల్స్, బంగారం తయారుచేసింది వీళ్ళా... వీళ్ళు కాదు... కాదు..... వారన్... వారన్ బంగారపు సృష్టికర్త... ఇక బ్రిటిష్ సామ్రాజ్యానికి తిరుగులేదు. వర్తకుల పేరుతో ఏ దేశం వెళ్ళి లోబర్చుకోవాల్సిన అవసరంలేదు."

అయిదో అతనికి పూర్తిగా అర్థమయింది. తమని మట్టిలోనే కాదు చరిత్రలోనూ అదృశ్యం చెయ్యటానికి వారన్ నిశ్చయించుకున్నాడని. అలా జరక్కూడదు. అవును! అలా జరగకూడదు...

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Aranya+Ghosha+Maithili+Venkateswara+Rao**

* * *